క్లుప్తంగా

మాధవరావుకు కళారత్న పురస్కారం



కావలి: పట్టణానికి చెందిన ప్రముఖ ఇంద్రజాలికుడు వేములపాటి మాధవరావు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నుంచి కళారత్న పురస్కారాన్ని అందుకున్నారు. విజయవాడలో రాష్ట్ర భాష, సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ఉగాది వేడుకల్లో సీఎం చంద్రబాబునాయుడు పురస్కారాన్ని ప్రదానం చేశారు.

అమరజీవి విగ్రహ ఏర్పాటుకు భూమిపూజ



ఆత్మకూరు (చేజర్ల): చేజర్లలోని బస్టాండ్ సెంటర్‌లో అమరజీవి పొట్టి శ్రీరాములు కాంస్య విగ్రహం ఏర్పాటుకు భూమి పూజా కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఎంపీపీ తూమాటి విజయభాస్కర్‌రెడ్డి చేతుల మీదుగా విగ్రహ నిర్మాణ కమిటీ సభ్యులు భూమి పూజ చేయించారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య నాయకులు పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం



ఆత్మకూరు: పట్టణంలోని ఎంజీఆర్ మున్సిపల్ బస్టాండ్ ప్రాంగణంలో దాత కంచి పరమేశ్వర రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని సీఐ జీ గంగాధర్ సోమవారం ప్రారంభించారు. అనంతరం ప్రయాణికులకు మజ్జిగ పంపిణీ చేశారు. కుడుముల సుధాకర్‌రెడ్డి, రాంపల్లి ప్రసాద్‌రెడ్డి, కేవీ శేషారెడ్డి, నరసింహారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కోలాహలంగా ఉగాది వేడుకలు



ఆత్మకూరురూరల్: మండలంలోని మహిమలూరు, రామస్వామిపల్లి గ్రామాల్లో ఉగాది వేడుకలను సోమవారం కోలాహలంగా నిర్వహించారు. మహిమలూరులోని కోదండరామ స్వామి ఆలయంలో సీతారాముల కల్యాణాన్ని నిర్వహించారు. రామస్వామిపల్లిలో పారువేట ఉత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పండరి భజనను ప్రదర్శించారు.

రెడ్‌క్రాస్ చైర్మన్‌కు ఉగాది పురస్కారం



కావలి: రెడ్‌క్రాస్ కావలి శాఖ చైర్మన్ డాకారపు రవిప్రకాష్ దీపం ఉగాది పురస్కారాన్ని అందుకున్నారు. విజయవాడలోని మాకినేని బసవ పున్నయ్య విజ్ఞాన కేంద్రంలో ఫొటోగ్రఫీ అకాడమీ ఆఫ్ ఇండియా, జీఆర్కే–పోలవరపు సాంస్కృతిక సమితి, సుమతి అంతర్జాల తెలుగు మాసపత్రిక సంయుక్త ఆధ్వర్యంలో దీపం ఉగాది పురస్కారాలను ఆదివారం ప్రదానం చేశారు. దేశ వ్యాప్తంగా వివిధ రంగాల్లో కృషి చేసిన 34 మంది తెలుగువారికి పురస్కారాలను అందజేశారు. అందులో భాగంగా రెడ్‌క్రాస్ ద్వారా విశిష్ట సేవలు అందిస్తున్న రవిప్రకాష్‌కు సామాజిక సేవ విభాగంలో పురస్కారాన్ని ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి కే మన్మధరావు, మాజీ ఎంపీ గోకరాజు గంగరాజు, కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత పెనుగొండ లక్ష్మీనారాయణ చేతుల మీదుగా ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు, ప్రముఖ చరిత్ర పరిశోధకులు కొంపల్లి సుందర్, తమ్మా శ్రీనివాసులురెడ్డి, గోళ్ల నారాయణరావు, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంపై కేసు నమోదు

ఆత్మకూరు(చేజర్ల): చేజర్ల మండలం నూతక్కివారికండ్రిగ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంపై ఎస్సై తిరుమలరావు సోమవారం కేసు నమోదు చేశారు. తూర్పుపల్లికి చెందిన రత్నమ్మ శుక్రవారం ఉదయం నూతక్కివారికండ్రిగ సమీపంలోని నిమ్మతోటలోకి పనికి వెళ్లింది. మధ్యాహ్నం తిరిగి రోడ్డుపై నడుచుకుంటూ ఇంటికి వస్తున్న క్రమంలో టాటా మ్యాజిక్ డ్రైవర్ బాబు మద్యం మత్తులో వాహనాన్ని నడుపుతూ రత్నమ్మను ఢీకొన్నాడు. దీంతో రత్నమ్మ తీవ్రంగా గాయపడగా నెల్లూరుకు తరలించారు. సోమవారం ఆమె స్పృహలోకి రావడంతో వివరాలు తెలుసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

భక్తిశ్రద్ధలతో ఈద్–ఉల్–ఫిత్ర్

పవిత్ర రంజాన్ పర్వదినం (ఈద్–ఉల్–ఫిత్ర్)ను ముస్లింలు భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు. మసీదులు, ఈద్గాల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. మతపెద్దలు రంజాన్ సందేశాన్ని వినిపించారు. కావలి, ఉదయగిరి, ఆత్మకూరు నియోజకవర్గాల్లో ఆధ్యాత్మిక శోభ వెల్లివిరిసింది.

కావలి: పట్టణం, రూరల్‌లోని ముస్లింలు రంజాన్ పర్వదినాన్ని భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. పట్టణంలోని గాయత్రీనగర్ ప్రాంతంలోని అహలే హదీస్ జమాత్, వైకుంఠపురంలోని మదీనా మసీదు, కసాయివీధిలోని అక్సా మసీదు, ఇందిరమ్మ కాలనీలోని ఉస్మాన్ గనీ మసీదు, రైల్వే రోడ్డులోని ప్రతిష్టాత్మక జామియా మసీదు, కచ్చేరి మిట్టలోని నూర్ మసీదు, బుడమగుంటగేట్ వద్ద ఉన్న మహమ్మదీయ మసీదు, గోరింకపాళెంలోని ఉమర్ మసీదు, తుఫాన్‌నగర్‌లోని ఈద్గా మైదానం, ఉత్తరంపేట అహలే సున్నత్ జమాత్ మసీదుల్లో రంజాన్ నమాజులు, ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. మతపెద్దలు రంజాన్ సందేశాన్ని అందజేశారు. నెలరోజుల పాటు ఉపవాస దీక్షలు ఆచరించిన ముస్లింలు ఈద్గాలు, మసీదులకు వెళ్లి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం ఒకరికొకరు పండగ శుభాకాంక్షలు తెలుపుకొన్నారు. పేదలకు దానధర్మాలు చేశారు. కాగా మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే దగుమాటి వెంకటకృష్ణారెడ్డి, తదితర ప్రముఖులు ముస్లింలకు రంజాన్ పండగ శుభాకాంక్షలు తెలిపారు.

అల్లూరు: మండలంలోని ముస్లింలు రంజాన్ పర్వదినాన్ని భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు. అల్లూరులోని మసీదు సెంటర్‌లోని జామియా మసీద్, బీసీ కాలనీలోని మదీనా మసీదుల్లో ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. మతపెద్దలు రంజాన్ సందేశాన్ని వినిపించారు. ఇస్లామిక్ క్యాలెండర్‌లోని 9వ మాసం రంజాన్ మాసంలో దివ్య ఖురాన్ ఆవిర్భవించిందని తెలిపారు. క్రమశిక్షణ, దాతృత్వం,ధార్మిక చింతనల కలయికే రంజాన్ పండగని పేర్కొన్నారు. అనంతరం ముస్లింలు ఒకరినొకరు ఆలింగనం చేసుకుని రంజాన్ శుభాకాంక్షలు తెలుపుకొన్నారు. మధ్యాహ్నం అన్నదానం చేశారు. ఇమామ్‌లు అజ్మల్, మసీద్ ప్రెసిడెంట్లు షేక్ సమద్, షేక్ ఆకూర్, ముతవల్లి షేక్ ఉస్మాన్ షరీఫ్, తదితరులు పాల్గొన్నారు.

ఉదయగిరి: మండలంలోని ముస్లింలు రంజాన్ పర్వదినాన్ని భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు. గండిపాళెం, ఉదయగిరి, వెంగళరావునగర్, బిజ్జంపల్లి, బోడబండ, దాసరపల్లి, అయ్యవారిపల్లె, మాసాయిపేట, తదితర గ్రామాల్లోని ముస్లింలు ఈద్గాలకు చేరుకుని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. పేదలకు దానధర్మాలు చేశారు. ఉదయగిరిలోని ఈద్గాలో జరిగిన ప్రత్యేక ప్రార్థనల్లో ఎమ్మెల్యే కాకర్ల సురేష్ పాల్గొన్నారు. ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ మాజీ చైర్మన్ పొన్నెబోయిన చెంచలబాబుయాదవ్, టీడీపీ మండల కన్వీనర్ బయ్యన్న, మైనార్టీ నాయకులు రియాజ్, సంధానీ పాల్గొన్నారు.

వింజమూరు(ఉదయగిరి): వింజమూరు మండల ప్రజలు రంజాన్ పర్వదినాన్ని భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు. వింజమూరు బంగ్లా సెంటర్‌లో ఉన్న ఈద్గా మైదానంలో ముస్లింలు ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం ఒకరికొకరు పండగ శుభాకాంక్షలు తెలుపుకొన్నారు. పేదలకు దానధర్మాలు చేశారు.



కావలి వైకుంఠపురం మసీదు ఆవరణలో నమాజ్ చేస్తున్న ముస్లింలు



కావలి: రంజాన్ సందేశాన్ని ఇస్తున్న మతపెద్ద



ఆత్మకూరు: ఈద్గా మైదానంలో ..



దుత్తలూరులోని నందిపాడు ఈద్గాలో..



అల్లూరులోని జామియా మసీద్‌లో..

వరికుంటపాడు: మండలంలోని వరికుంటపాడు, తిమ్మారెడ్డిపల్లి, విరువూరు, పెద్దిరెడ్డిపల్లి, తోటలచెరువుపల్లి, తూర్పుబోయమడుగుల, తదితర గ్రామాల్లోని ముస్లింలు రంజాన్ పర్వదినాన్ని భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు. స్థానిక ఈద్గాల వద్ద సామూహిక ప్రార్థనలు నిర్వహించారు. మతపెద్దలు రంజాన్ పర్వదినం సందేశాన్ని అందజేశారు. అనంతరం ఒకరికొకరు పండగ శుభాకాంక్షలు తెలుపుకొన్నారు. పేదలకు దానధర్మాలు చేశారు. తమ స్నేహితులను ఆహ్వానించి కలిసిమెలిసి భోజనాలు చేశారు.

సీతారామపురం : మండలంలోని సీతారామపురం, తురకపాళెం, నారాయణప్పపేట, రంగనాయుడుపల్లి, అయ్యవారిపల్లి, సింగారెడ్డిపల్లి, బసినేనిపల్లి, గంధంవారిపల్లి తదితర గ్రామాల్లోని ముస్లింలు రంజాన్ పర్వదినాన్ని భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు. తొలుత ఆయా గ్రామాల్లోని ముస్లింలు మసీదుల వద్దకు చేరుకున్నారు. అక్కడి నుంచి కల్మా చదువుకుంటూ ఈద్గాల వద్దకు చేరుకుని సామూహిక ప్రార్థనలు నిర్వహించారు. మతగురువులు ఖురాన్ సందేశాన్ని వినిపించి ప్రతిఒక్కరూ అల్లాహ్ చూపిన సన్మార్గంలో నడవాలని సూచించారు.

జలదంకి: మండలంలోని బీకే అగ్రహారం, జలదంకి, జమ్మలపాళెం, సోమవరప్పాడు, చోడవరం, తదితర గ్రామాల్లోని ముస్లింలు రంజాన్ పర్వదినాన్ని భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు. ఆయా గ్రామాల్లోని మసీదుల్లో మతపెద్దల సమక్షంలో ముస్లింలు ప్రత్యేక నమాజులు చేశారు. అనంతరం పండ్లు, స్వీట్లు తినిపించుకుని ఒకరికొకరు పండగ శుభాకాంక్షలు తెలుపుకొన్నారు. జలదంకిలోని ఈద్గా మైదానంలో మదీనా మసీదు కమిటీ అధ్యక్షుడు సయ్యద్ రసూల్ సాహెబ్, మాజీ కోఆప్షన్ సభ్యుడు సయ్యద్ ఖాజారంతుల్లా, కమిటీ సభ్యుల పర్యవేక్షణలో ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

దుత్తలూరు: మండల కేంద్రమైన దుత్తలూరు, బీసీ కాలనీ, లక్ష్మీపురం, కమ్మవారిపాళెం, నందిపాడు, నర్రవాడ, ఏరుకొల్లు, వెంకటంపేట, తదితర గ్రామాల్లోని ముస్లింలు ఈద్గాల వద్దకు చేరుకుని సామూహికంగా ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం ముస్లింలు ఒకరికొకరు ఆలింగనం చేసుకుని రంజాన్ శుభాకాంక్షలు తెలుపుకొన్నారు. తమ బంధుమిత్రులకు విందు ఏర్పాటు చేశారు.

ఆత్మకూరు: పట్టణంలోని ముస్లింలు రంజాన్ పర్వదినాన్ని భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు. పట్టణంలోని ముస్లింలు సత్రం సెంటర్ వద్ద కలుసుకుని సామూహికంగా కల్మా చదువుకుంటూ జేఆర్‌పేటలోని ఈద్గా మైదానం వద్దకు చేరుకున్నారు. అనంతరం సామూహిక ప్రార్థనలు చేశారు. మతపెద్దలు రంజాన్ సందేశాన్ని వినిపించారు. అనంతరం ముస్లింలు ఒకరికొకరు ఆలింగనం చేసుకుని రంజాన్ శుభాకాంక్షలు తెలుపుకొన్నారు. పేదలకు దానధర్మాలు చేశారు. బంధుమిత్రులతో కలిసి విందు భోజనాలు చేశారు.

ఆత్మకూరురూరల్: మండలంలోని మహిమలూరు, అశ్వనీపురం, దేపూరు, అప్పారావుపాళెం, బట్టేపాడు, వాశిలి, బోయలచిరివెళ్ల, బొటికర్లపాడు, తదితర గ్రామాల్లోని ముస్లింలు రంజాన్‌ను భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు. స్థానిక ఈద్గాల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కరటంపాడులోని ఈద్గాలో జరిగిన ప్రార్థనల్లో ముస్లింలు వక్ఫ్‌బోర్డు చట్టసవరణకు వ్యతిరేకంగా నల్లరిబ్బన్లు ధరించి పాల్గొన్నారు.

అనుమసముద్రంపేట: మండలంలోని ముస్లింలు రంజాన్ పర్వదినాన్ని భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు. ఏఎస్‌పేటలోని హజరత్ సయ్యద్ ఖాజారహమతుల్లా నాయబ్ రసూల్ వారి దర్గా ఆవరణలోని మదీనా మసీదులో సామూహిక ప్రార్థనలు నిర్వహించారు. మత గురువులు రంజాన్ సందేశాన్ని అందజేశారు. అనంతరం ముస్లింలు ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకొన్నారు. రాష్ట్ర వక్ఫ్‌బోర్డు ఆదేశాల మేరకు దర్గా ఈఓ షేక్ మహ్మద్‌హుస్సేన్ ఆధ్వర్యంలో భారీ ఏర్పాట్లు చేశారు.

సోమశిల: అనంతసాగరం మండలంలోని ముస్లింలు రంజాన్ పర్వదినాన్ని భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు. ఈద్గాల వద్దకు చేరుకుని సామూహిక ప్రార్థనలు చేశారు. అనంతరం ఒకరికొకరు ఆలింగనం చేసుకుని శుభాకాంక్షలు తెలుపుకొన్నారు.

సంగం: మండలంలోని ముస్లింలు రంజాన్ పర్వదినాన్ని భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు. ఈద్గాల వద్దకు చేరుకుని సామూహిక ప్రార్థనలు చేశారు. మతపెద్దలు రంజాన్ సందేశాన్ని అందజేశారు.

మర్రిపాడు: మండలంలోని ముస్లింలు రంజాన్ పర్వదినాన్ని భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు. ఈద్గాల వద్దకు చేరుకుని సామూహిక ప్రార్థనలు చేశారు. అనంతరం ఒకరికొకరు ఆలింగనం చేసుకుని శుభాకాంక్షలు తెలుపుకొన్నారు. పేదలకు దానధర్మాలు, అన్నదానం చేశారు.

ఆత్మకూరు(చేజర్ల): చేజర్ల మండలంలోని ముస్లింలు రంజాన్ పర్వదినాన్ని భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు. చేజర్లలోని మసీదు, ఆదూరుపల్లిలోని ఈద్గా మైదానంలో సామూహిక రంజాన్ ప్రార్థనలు నిర్వహించారు. మతపెద్ద మౌలానా మహబూబ్‌బాషా రంజాన్ సందేశాన్ని అందజేశారు.



జలదంకిలోని ఈద్గా మైదానంలో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు



కావలి: రైల్వేస్టేషన్ రోడ్డు మసీదులో పండగ శుభాకాంక్షలు తెలుపుకుంటున్న ముస్లింలు



వింజమూరులోని ఈద్గా మైదానంలో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు



ఆత్మకూరురూరల్: కరటంపాడు ఈద్గాలో..



రంజాన్ శుభాకాంక్షలు తెలుపుకొంటున్న చిన్నారులు



కావలి: రైల్వేస్టేషన్ రోడ్డులోని పెద్ద మసీదులో..



ఆత్మకూరు: ఆదూరుపల్లి ఈద్గా మైదానంలో..



ఏఎస్‌పేట దర్గాలోని మదీనా మసీదులో..



సంగంలో..



అనంతసాగరంలో..



మర్రిపాడులో..



సీతారామపురంలోని ఈద్గా వద్ద..

రేషన్‌కార్డుదారులకు ఊరట

- ఏప్రిల్ 30 వరకు ఈకేవైసీ గడువు పెంపు

సీతారామపురం : ఈకేవైసీ పెండింగ్‌లో ఉన్న రేషన్ కార్డుదారులందరికీ ప్రభుత్వం ఊరట కల్పించింది. ఈకేవైసీ గడువును మార్చి 31వ తేదీ నుంచి ఏప్రిల్ 30వ తేదీ వరకు పొడిగించినట్లు జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి అంకయ్య తెలిపారు. అయితే ఈ దఫా గ్రామ వార్డు సచివాలయాలకు సంబంధించిన యాప్, రేషన్ షాపులోని ఈ–పాస్ ద్వారా ఈకేవైసీ చేసుకునే సౌకర్యాన్ని కల్పించారు. రేషన్ కార్డులో పేరు ఉన్న ఐదేళ్లు, అంతకంటే తక్కువ వయస్సు ఉన్న పిల్లలు మినహా, మిగిలిన వారందరూ కూడా ఈకేవైసీని పూర్తి చేయాల్సి ఉంటుందని ప్రభుత్వం చెబుతోంది. జిల్లాలో సుమారు 20,04,581 మంది రేషన్ లబ్ధిదారులు ఉండగా, వారిలో 18 లక్షల మందికి పైబడి ఈకేవైసీ నమోదు చేసుకుని ఉన్నారు. మిగిలిన 2 లక్షల మంది ఇంకా ఈ కేవైసీ చేసుకోవాల్సి ఉన్నట్లు అధికార వర్గాల అంచనా.



ఈ–పాస్ మెషీన్ ద్వారా ఈకేవైసీ చేస్తున్న దృశ్యం

కార్డుల్లో కోత వేసేందుకేనా?

అనర్హుల గుర్తింపు కోసమంటూ కార్డుల్లో కోత కోయడానికి ప్రభుత్వం రేషన్ కార్డుల ఈకేవైసీ ప్రక్రియను చేపట్టిందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఒకే ఇంట్లో ఉంటూ రెండు నంబర్ల ద్వారా కార్డులను పొందడం, మృతి చెందిన కుటుంబ సభ్యుల పేర్లను తొలగించకపోవడం, వారి పేర్ల మీద రేషన్ సహా, ఇతర సంక్షేమ పథకాలను లబ్ధి పొందుతుండడం వంటి వాటిని గుర్తించేందుకు ఈకేవైసీ ప్రక్రియను చేపట్టిందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. అనేకమంది పొట్టకూటి కోసం పక్కరాష్ట్రాలు, ఇతర దేశాలకు వెళ్లి ఉన్నారు. అలాంటి వారు త్వరితగతిన స్వగ్రామాలకు చేరుకుని ఈకేవైసీ చేయించుకునే పరిస్థితుల్లో లేరని స్థానికులు చెబుతున్నారు. అలాంటి పరిస్థితుల్లో ఈకేవైసీని సాకుగా చూపి కార్డులను రద్దు చేస్తారనే భయం స్థానికుల్లో నెలకొంది. కేంద్ర ప్రభుత్వ ఉత్తర్వులను ఆసరాగా చేసుకుని రాష్ట్ర ప్రభుత్వం ఈకేవైసీ ప్రక్రియను అనుకున్న విధంగా పూర్తి చేయడానికి సన్నాహాలు చేస్తోంది. దీని వల్ల వేల కార్డుదారులకు బియ్యం సహా, ఇతర నిత్యావసర సరుకులు దక్కకపోవచ్చని రెవెన్యూ అధికారులు నోట వినిపిస్తున్న మాట. దీనిపై కొంతకాలంగా అధికారులు కార్డుదారులకు ఈకేవైసీ తప్పనిసరిగా చేయించుకోవాలని అవగాహన కల్పిస్తున్నారు. ఈ కేవైసీ నమోదులో కార్డుదారులను సాంకేతిక సమస్యలు ఇబ్బంది పెడుతున్నాయి. తొలుత ప్రభుత్వం మార్చి 31వ తేదీ వరకు ఈకేవైసీ గడువును ఇచ్చింది. గడువు సమీపించినా ప్రక్రియ పూర్తి కాకపోవడంతో ఏప్రిల్ 30వ తేదీ వరకు..అంటే మరో నెలరోజుల పాటు ఈకేవైసీ గడువును పొడిగించినట్లు జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారులు చెబుతున్నారు.

మినీఅంగన్‌వాడీ కేంద్రం ఏర్పాటుపై పరిశీలన



సంగం: స్థానిక పాత చెక్‌పోస్టు వద్ద ఉన్న ఎస్సీ కాలనీలో మినీఅంగన్‌వాడీ కేంద్రం ఏర్పాటుపై ఐసీడీఎస్ పీడీ నిర్మలాదేవి, డిప్యూటీ డీఈఓ జానకీరాం సోమవారం పరిశీలించారు. రెండ్రోజుల క్రితం సంగంలో పర్యటించిన మంత్రి ఆనం రామనారాయణరెడ్డికి ఎస్సీకాలనీవాసులు మినీఅంగన్‌వాడీ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని వినతిపత్రం అందజేశారు. ఈ మేరకు మినీఅంగన్‌వాడీ కేంద్రం ఏర్పాటు చేసేందుకు అవసరమైన మేర చిన్నారులు ఉన్నారా ..లేదా అని పరిశీలించారు. త్వరలో కాలనీలో మినీ అంగన్‌వాడీ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తామని పీడీ తెలిపారు. 1, 2 తరగతుల విద్యార్థులు హైవే దాటి వెళ్లకుండా ప్రీస్కూల్‌ను ఏర్పాటు చేయనున్నట్లు డిప్యూటీ డీఈఓ తెలిపారు.

అన్నదానంతో ఎంతో సంతృప్తి



ఆత్మకూరు: పట్టణంలోని ప్రభుత్వ జిల్లా ఆస్పత్రిలో సాంబశివ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిత్యాన్నప్రసాద పథకాన్ని ప్రారంభించి రెండేళ్లు పూర్తయిన సందర్భంగా ఆ ట్రస్ట్ నిర్వాహకుడు కంచి పరమేశ్వరరెడ్డి సోమవారం కేక్‌ను కట్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో తాను ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహించినప్పటికీ ఆత్మకూరులోని ప్రభుత్వ వైద్యశాలకు వచ్చే రోగులు, వారి బంధువులకు అన్నప్రసాదం పంపిణీ చేయడం ఎంతో సంతృప్తిని ఇచ్చిందన్నారు. అప్పటి నుంచే ఆత్మకూరులో మృతుల కుటుంబాలకు ఆర్థిక సాయం, పాఠశాల విద్యార్థులకు రవాణా వసతి, ఉచిత కైలాస రథం, ఉచిత శవపేటికలు, తదితర సేవా కార్యక్రమాలను విస్తృతం చేశామని తెలిపారు. ట్రస్ట్ సభ్యులు కేవీ శేషారెడ్డి, నరసింహారెడ్డి, రాంపల్లి ప్రసాద్, రమణయ్య, మహేశ్వర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

వక్ఫ్ చట్ట సవరణ బిల్లును రద్దు చేయాలి

సోమశిల: వక్ఫ్ చట్ట సవరణ బిల్లును రద్దు చేయాలని ఆవాజ్ కమిటీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆవాజ్ కమిటీ ఆధ్వర్యంలో అనంతసాగరంలో ముస్లింలు సోమవారం నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈద్గాలో రంజాన్ ప్రార్థనల అనంతరం ముస్లింలు ఈద్గా నుంచి బస్టాండ్ సెంటర్ వరకు ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వం వక్ఫ్ భూములను అదాని, అంబాని వంటి కార్పొరేట శక్తులకు అప్పగించడానికి వక్ఫ్ చట్టం అడ్డంగా ఉందని, దాన్ని మార్చే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వం ముస్లింల మనోభావాలను గౌరవించి వక్ఫ్ చట్ట సవరణ బిల్లుపై పునరాలోచన చేయాలన్నారు. కేంద్ర ప్రభుత్వం బిల్లును ఉపసంహరించుకోకపోతే నిరసనలు కొనసాగిస్తామన్నారు. జిల్లా కమిటీ సభ్యులు అన్వర్‌బాషా, ఆవాజ్ కమిటీ మండలాధ్యక్షుడు సయ్యద్ ఇఫ్తిఖర్ అహ్మద్, మండల కార్యదర్శి సలీం, తదితరులు పాల్గొన్నారు.



సోమశిల: అనంతసాగరంలో నిరసన ప్రదర్శన చేపడుతున్న ముస్లింలు



ఏఎస్‌పేటలో నల్లరిబ్బన్లు ధరించి నిరసన తెలుపుతున్న ముస్లింలు



ఉదయగిరి: నల్లరిబ్బన్లు ధరించి ప్రార్థనల్లో పాల్గొన్న ముస్లింలు

అనుమసముద్రంపేట: వక్ఫ్ చట్ట సవరణ బిల్లును వ్యతిరేకిస్తూ ఏఎస్‌పేటలోని ముస్లింలు నల్లబ్యాడ్జీలు ధరించి రంజాన్ నమాజ్‌లో పాల్గొన్నారు. నమాజ్ అనంతరం దర్గా మెయిన్ గేట్ వద్ద శాంతియుతంగా నిరసన ప్రదర్శన చేపట్టారు. వక్ఫ్ చట్ట సవరణ బిల్లుపై కేంద్ర ప్రభుత్వం పునరాలోచించాలని డిమాండ్ చేశారు.

ఉదయగిరి: వక్ఫ్ చట్ట సవరణ బిల్లును వ్యతిరేకిస్తూ ఆవాజ్ మండల కమిటీ ఆధ్వర్యంలో ముస్లింలు నల్లరిబ్బన్లను ధరించి నిరసన తెలిపారు. బిజ్జంపల్లిలోని ఈద్గా మైదానంలో జరిగిన రంజాన్ ప్రార్థనల్లో నల్లరిబ్బన్లతో పాల్గొని తమ నిరసనను వ్యక్తం చేశారు.